క్లుప్తంగా

నేడు బీఆర్ఎస్ పార్టీ కార్ల ర్యాలీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): వచ్చే ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం నియోజకవర్గంలో కార్ల ర్యాలీ నిర్వహించనున్నారు. రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను నియోజకవర్గ ఇన్‌చార్జ్‌గా నియమించిన నేపథ్యంలో ఆయనతోపాటు, ఎంపీ నామా నాగేశ్వరరావు, విప్ రేగా కాంతారావు, ఎమ్మెల్సీ తాత మధు ఈ ర్యాలీలో పాల్గొననున్నారు. సుజాతనగర్ మండలం నాయకులగూడెం నుంచి పాల్వంచ మండలంలోని పెద్దమ్మగుడి వరకు ఈ ర్యాలీ ఉంటుంది. నియోజకవర్గ వ్యాపితంగా కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు ర్యాలీలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

సుజాతనగర్: ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ (ఐఎస్‌జీఎఫ్) జిల్లా స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని వేపలగడ్డలోని వలస కూలీలకు ఆదివారం నిత్యావసరాలు పంపిణీ చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఐఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎండీ ఖాసిం, సభ్యులు సీహెచ్ బ్రహ్మం, పి.రామకృష్ణ, నజీర్ అహ్మద్, డింపుల్ శర్మ, జ్యోతిరాణి, నసీంపాషా, ఉమ, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'హరీ'తహారం..



టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎండిపోతున్న మొక్కలు

టేకులపల్లి: హరితహారం కార్యక్రమంలో భాగంగా గత నెల 26న రాష్ట్ర వ్యాపితంగా కోటి వృక్షార్చన పేరుతో అన్ని గ్రామాల్లో మొక్కలు నాటారు. ఇందులో భాగంగా ఎంపీడీఓ, ఎంపీఓ, ఎంపీపీ, ఏపీఓలు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో అధికారులు, నాయకులు మొక్కలు నాటుతూ ఫొటోలకు ఫోజులిచ్చారు. వారం రోజులు దాటినా నీరు పోసే దిక్కు లేక నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. నీరు పోయాల్సిన బాధ్యత అధికారులదా? పంచాయతీ సిబ్బందిదా? లేక పాఠశాల ఉపాధ్యాయులదా? అని స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

బిల్డింగ్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నబీ

ఇల్లెందు: బిల్డింగ్ వర్కర్స్ అండ్ అదర్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఈ చలో హైదరాబాద్ ధర్నాకు తరలిరావాలని సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ఏ నబీ, కూకట్ల శంకర్ కోరారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికుల వెల్ఫేర్ బోర్డు నిధులు రూ.1100 కోట్లు ఇతర శాఖలకు మళ్లించారని, నిధులు లేక కార్మికుల వెల్ఫేర్ నిర్వీర్యమైపోయిందన్నారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5న హైదరాబాద్‌లో జరగనున్న ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. మహమూద్, కోటేశ్వరరావు, భద్రూ, వెంకన్న, వీరస్వామి, సామ్యానాయక్, పవన్, రాము, మహేష్, కుమార్ పాల్గొన్నారు.

కలిసుండలేం.. విడగొట్టండి

- ఆదాయం ఉన్నా అభివృద్ధికి నోచుకోని వేపలగడ్డ గ్రామం
- ప్రత్యేక పంచాయతీ కోసం స్థానికుల పట్టు



వేపలగడ్డ గ్రామ వ్యూ

సుజాతనగర్: గ్రామ పంచాయతీకి కావాల్సిన అన్ని అర్హతలు తమ గ్రామానికి ఉన్నాయని, ప్రత్యేక పంచాయతీగా ప్రకటిస్తే తమ గ్రామాన్ని తామే అభివృద్ధి చేసుకుంటామని వేపలగడ్డ గ్రామస్తులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. వీరి డిమాండ్ మేరకు ప్రత్యేక పంచాయతీగా ఆమోదం రాకపోవడంతో 'సొమ్ము తమదైతే.. సోకు మరొకరిది'అనే చందంగా ఉందని ఆ గ్రామస్తులు పెదవి విరుస్తున్నారు.

ఖమ్మం, కొత్తగూడెం ప్రధాన రహదారిలో వేపలగడ్డ గ్రామం ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం గ్రామంలో 205 కుటుంబాలు ఉన్నాయి. మొత్తం జనాభా 779 కాగా, పురుషులు 395, మహిళలు 384 మంది ఉన్నారు. ప్రస్తుత ఓటరు జాబితా ప్రకారం 1,084 మంది ఓటర్లు ఉన్నారు. సుజాతనగర్ గ్రామ పంచాయతీలోని 14 వార్డుల్లో 1, 2, 3 వార్డులు వేపలగడ్డ గ్రామ పరిధిలో ఉన్నాయి. సుజాతనగర్ గ్రామ పంచాయతీలో విలీనమై ఉన్న వేపలగడ్డ గ్రామం నుంచే ఏడాదికి రూ.8 లక్షల ఆదాయం సుజాతనగర్ జీపీకి వెళుతోంది. పన్నుల రూపేణా చెల్లించే ఈ మొత్తంతో తమ గ్రామాన్ని తామే అభివృద్ధి చేసుకుంటాం అంటూ... ప్రత్యేక పంచాయతీ డిమాండ్‌తో గ్రామస్తులు తెరపైకి తెస్తున్నారు. తమ గ్రామం సుజాతనగర్‌లో కలిసుండటం వలన అభివృద్ధికి నోచుకోవడం లేదని, ప్రతి చిన్న విషయానికి సుజాతనగర్‌కు వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కళాశాలలకు పుట్టినిల్లుగా...

పేరుకు సుజాతనగర్ మండలం అయినా వేపలగడ్డ గ్రామం మాత్రం పలు కళాశాలలకు పుట్టినిల్లుగా ఉంది. ఇంజనీరింగ్, బీఈడీ, ఫార్మసీ, ఎంబీఏ, ఐటీఐ కళాశాలలతో పాటు పెట్రోల్ బంకులు కూడా ఈ గ్రామ పరిధిలోనే ఉన్నాయి. విలువైన రిజిస్ట్రేషన్ భూములు ఉండటంతో ఇక్కడ వేసిన వెంచర్ల రూపేణా ఆదాయం కూడా ప్రస్తుత పంచాయతీ సుజాతనగర్‌కే వెళుతోంది. దీంతో తమ గ్రామం నుంచి సుజాతనగర్ గ్రామ పంచాయతీకి అధిక ఆదాయం వెళుతోందని, తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీ చేయాల్సిందేనని గ్రామస్తులు పట్టుబడుతున్నారు.

బ్యాలెట్ బాక్సుల్లో స్లిప్పులు..

వేపలగడ్డ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా మార్పు చేయాలని స్థానికులు కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా చేస్తే ఈ నిధులు తమ గ్రామాభివృద్ధికే ఉపయోగపడతాయని స్థానికులు అంటున్నారు. 2018 డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల సమయంలో తమ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీ చేయాలంటూ స్లిప్పులు రాసి బ్యాలెట్ బాక్సుల్లో వేయడం కూడా అప్పట్లో సంచలనంగా మారింది. గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా చేయాలంటూ స్థానిక ఎమ్మెల్యే, జిల్లా పంచాయతీ అధికారికి గ్రామస్తులు వినతులు సైతం అందజేశారు. అయినా ఇప్పటివరకు ఎవరూ పట్టించుకున్న దాఖలాలు లేవు.

గతంలో గ్రామ పంచాయతీ తీర్మానం..

వేపలగడ్డ గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఎంపిక చేసే విషయంలో 2021 అక్టోబర్‌లో గ్రామ పంచాయతీ ఏకగ్రీవ తీర్మానం చేసింది. గ్రామాన్ని ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసేందుకు 1, 2, 3 వార్డు సభ్యులు దరఖాస్తు చేయగా... సభ్యులెవరూ అభ్యంతరం తెలియజేయని కారణంగా ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు సైతం పంపించారు.



ప్రత్యేక పంచాయతీ చేయాలని ఎమ్మెల్యే వనమాకు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు (ఫైల్)

ప్రత్యేకం అయితేనే అభివృద్ధి



వేపలగడ్డ గ్రామాన్ని ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాం. తమ గ్రామం నుంచి పన్నుల రూపేణా లక్షలాది రూపాయలు సుజాతనగర్‌కు వెళుతోంది. ప్రత్యేక గ్రామ పంచాయతీ అయితే ఆ నిధులతో తమ గ్రామాన్ని తామే అభివృద్ధి చేసుకుంటాం.

– రెడ్డెం తులసిరెడ్డి, వేపలగడ్డ

ఇబ్బందులు పడుతున్నాం



వేపలగడ్డ గ్రామం సుజాతనగర్‌లో కలిసుండటంతో అభివృద్ధికి జరగడం లేదు. ప్రతి చిన్న విషయానికి పంచాయతీ కేంద్రమైన సుజాతనగర్‌కు వెళ్లాల్సి వస్తోంది. ప్రత్యేక పంచాయతీ కోసం పలువురు అధికారులకు వినతులు అందజేశాం. అధికారులు స్పందించి ప్రత్యేక పంచాయతీగా ప్రకటించాలి.

– అన్నపురెడ్డి శ్యాంసుందర్‌రెడ్డి, వేపలగడ్డ

మహిళలకు 33 శాతం సీట్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న బయ్యా శారద

ఇల్లెందు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికలలో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించేలా చట్టం అమలు చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు బయ్యా శారద డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు కూడా మహిళలకు 33శాతం సీట్లు కేటాయించాలని, లేదంటే ఆయా పార్టీలను మహిళలు ఓడించాలని సూచించారు. మహిళలకు రక్షణ కల్పించటంలో పాలకులు విఫలం చెందుతున్నారని వాపోయారు. రూ.1250 ధర పలుకుతున్న గ్యాస్‌ను రూ.200 తగ్గించి మహిళలను ఉద్ధరించినట్లు ప్రకటించటం ప్రధాని మోదీకి తగదన్నారు. సమావేశంలో ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా గౌరవాధ్యక్షురాలు నోముల కళావతి, ఉపాధ్యక్షురాలు కల్తీ రాములమ్మ, మల్లూరు సుగుణ, ప్రధాన కార్యదర్శి శారద, రేళ్ల నాగలక్ష్మి, చింత లాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎంపీఎఫ్ చిట్టీలు ఇవ్వండి



మాట్లాడుతున్న యాకుబ్‌షావలీ

ఇల్లెందు: సింగరేణి కాంట్రాక్టర్లకు సీఎంపీఎఫ్ చిట్టీలు అందజేయాలని ఇఫ్టూ అనుబంధ సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు యాకుబ్‌షావలీ డిమాండ్ చేశారు. ఆదివారం ఇల్లెందులోని 24 ఏరియాలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బొగ్గు పరిశ్రమలో పని చేస్తున్న 30 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు 2017 నుంచి జీతాలు పెరగటం లేదన్నారు. రూ.కోట్లు లాభాలు వస్తున్నా జీతాలు పెంచడం లేదని విమర్శించారు. ఎన్ని రోజులకు ఎంత వేతనం జమ చేస్తున్నారో కూడా వెల్లడించటం లేదని సీఎంపీఎఫ్ చిట్టీలు అందజేస్తేనే తెలిసే అవకాశం ఉందన్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేల వేతనాలు పెంచిన ప్రభుత్వం కార్మికుల వేతనాలు పెంచేందుకు నిరాకరిస్తోందని ఆరోపించారు.

కళ్లకు గంతలతో నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె ఆదివారం నాలుగో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కలెక్టరేట్ వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిరంలో కళ్లకు నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన తెలిపారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి నరాటి ప్రసాద్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాలు కాంట్రాక్టు పేరుతో నియామకాలు జరిపి అతితక్కువ వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారని దుయ్యబట్టారు. సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోగలక్ష్మి, పద్మ, మల్లమ్మ, శేషమ్మ, వెంకటేశ్వర్లు, ప్రశాంత్, సునీత, సరిత, సింధు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ధ్యేయం



ప్రచారం చేస్తున్న నాయకులు

కొత్తగూడెంరూరల్: కొత్తగూడెం మున్సిపాలిటీ 1వ వార్డులో గడప గడప కాంగ్రెస్ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. టీపీసీసీ సభ్యులు నాగ సీతారాములు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు ఊకంటి గోపాల్ రావు, ఆళ్ల మురళి, తూము చౌదరి ఇంటింటా ప్రచారం చేశారు. మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేసే మేనిఫెస్టోను ఇంటింటా ఇవ్వటం జరిగిందన్నారు. రైతులకు రూ.రెండు లక్షల రుణమాఫీ, నిరుద్యోగులకు రూ.4 వేల భృతి, వంట గ్యాస్ రూ.500 ఇస్తామని తెలిపారు.

కార్యక్రమంలో తాండ్ర నాగబాబు, ఎండీ కరీంపాషా, చిమట నాగేశ్వరరావు, అయూబ్‌ఖాన్, ఖమర్, సుందర్లాల్‌కోరి, రామనాథం, సమ్మయ్య, నరేష్, సత్యనారాయణరెడ్డి, దేవరగట్ల ప్రసాద్, కుమార్, వరప్రసాద్, దుర్గారాశి సతీష్, నింజన్‌రెడ్డి, శాంతి, ఉమ, పుష్ప తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి

ఇల్లెందు: మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ మధ్యాహ్న భోజనం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సుల్తానా కోరారు. ఆదివారం ఇల్లెందులో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ.. గత ఏడాది మార్చిలో పెంచిన వేతనాలు, ఏరియర్స్‌తో సహా చెల్లించాలని విన్నవించారు. మెనూ సవరించాలని, గుడ్లకు బడ్జెట్ పెంచాలని, గ్యాస్‌ను సబ్సిడీపై అందించాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని అక్షయపాత్ర లాంటి స్వచ్ఛంద సంస్థలకు అప్పగించరాదని పేర్కొన్నారు.

శంఖారావం సభకు తరలిన పద్మశాలీలు



సభకు వెళుతున్న పద్మశాలీలు

జూలూరుపాడు: హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ స్టేడియంలో ఆదివారం జరిగిన పద్మశాలీ శంఖారావం సభకు జూలూరుపాడు మండలం నుంచి పద్మశాలీలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. పద్మశాలీల హక్కుల సాధనకై జరిగిన సభకు కాకర్ల, జూలూరుపాడు, పడమటనర్సాపురం, గుండెపుడి గ్రామాలకు చెందిన పద్మశాలీలు వాహనాల్లో వెళ్లారు. వెళ్లిన వారిలో సంఘం నాయకులు సొబ్బని శ్రీను, సొబ్బని వెంకటేశ్వర్లు, సూరయ్య, కొండె శ్రీను, కొక్కుల సూరయ్య, దాసరి వెంకటేశ్వర్లు, కొండె రమేష్, సొబ్బని లాలయ్య, భాస్కర్, పోలూరి అప్పయ్య, తదితరులు ఉన్నారు.

గురుకుల కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

సుజాతనగర్: 2023–24 విద్యా సంవత్సరం నుంచి మహాత్మాగాంధీ జ్యోతిరావు పూలే బీసీ గురుకుల విద్యా సంస్థ సొసైటీ ఆధ్వర్యంలో కొత్తగూడెంలో ఏర్పాటు చేయనున్న బాలుర డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బీసీ గురుకుల ప్రిన్సిపాల్ వి.బ్యూలారాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఏ, బీకాం, సీఏ, బీఎస్సీ కోర్సుల్లో ప్రవేశాలుంటాయని హాస్టల్ వసతి, నోటు పుస్తకాలు, యూనిఫాం ఉచితంగా ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. వివరాలకు 8978552676 నంబరులో సంప్రదించాలని కోరారు.

విరాళం

పాల్వంచరూరల్: మండల పరిధి కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న పెద్దమ్మతల్లి ఆలయ పునర్నిర్మాణానికి పాల్వంచ కాంట్రాక్ట్ కాలనీకి చెందిన వి.సమ్మయ్య, విజయలక్ష్మి దంపతులు రూ.5,116, అన్నదానానికి వాసిరెడ్డి సుబ్బారావు, శాంతి దంపతులు రూ.5,116 విరాళాలు అందజేసినట్లు ఆలయ ఈఓ ఎన్.రజనీకుమారి ఆదివారం తెలిపారు. విరాళాలు అందజేసిన భక్త దంపతులకు అమ్మవారి శేషవస్త్ర ప్రసాదాలను అందజేసినట్లు పేర్కొన్నారు.

అభివృద్ధిపై శ్వేతపత్రం విడుదల చేయండి



మాట్లాడుతున్న కామేష్

పాల్వంచరూరల్: తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిపై బీఆర్ఎస్ ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ డిమాండ్ చేశారు. రాజాపురం, యానంబైల్, సత్యనారాయణపురం, కారెగట్టు గ్రామాల్లో ఆదివారం పర్యటించారు. ఆయా గ్రామాల్లో బీఎస్పీ జెండా పండగలో భాగంగా జెండాను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ఎన్నో పోరాటాలు, ఆత్మ బలిదానాలు, త్యాగాలతో వచ్చిన తెలంగాణ రాష్ట్రంలో రాక్షసపాలన సాగిస్తున్నారని విమర్శించారు. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలన నయవంచన, మోసం, దగాతోనే కొనసాగిందని ఆరోపించారు. మరోసారి ప్రజలను వంచించేందుకు కుయుక్తులు, పన్నాగాలతో మళ్లీ వస్తున్నారన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో రూ.వేల కోట్ల అభివృద్ధి కేవలం కాగితాలకే పరిమితమైందని, నిధులు మాత్రం అధికార పార్టీ నాయకుల జేబుల్లోకి వెళ్లాయని ఆరోపించారు. కొత్తగూడెం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలంటే ఒక్కసారి బీఎస్పీకి అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యర్రంశెట్టి రాజేశ్వరి, తోట వెంకన్న, మొహమ్మద్ ముంతాజ్, కాకటి శైలజ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం



హాజరైన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు

కొత్తగూడెంటౌన్: జిల్లాలోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండలం చాతకొండలోని ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమస్యలపై చర్చించుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. సంఘం రాష్ట్ర జేఏసీ నాయకులు లక్ష్మణ్ మాట్లాడుతూ.. జేఏసీ పిలుపు మేరకు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించినట్లు తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లో లక్ష మందితో నిర్వహించనున్న మహా గర్జనను విజయవంతం చేయాలని కోరారు. రాష్ట్ర ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ప్రభుత్వానికి అండగా నిలిచారని, అలాగే మా ఆరు లక్షల కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని ముఖ్యమంత్రిని వేడుకుంటున్నామన్నారు. ఎందరో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను బలి తీసుకుంటున్న ఏజెన్సీ వ్యవస్థను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల పలు డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో దిలీప్, కొండారెడ్డి, సునీత, ఆలీ, సత్యనారాయణ, శ్రీనివాస్, శ్రీకాంత్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుకు ప్రత్యేక శిబిరం



పాల్వంచరూరల్: ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ నమోదు శిబిరం



ఇల్లెందురూరల్: పోలింగ్ బూత్ వద్ద వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ రవికుమార్

పాల్వంచరూరల్: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు పాల్వంచ మండల, పట్టణ పరిధిలో ఆదివారం పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్ఓలు ప్రత్యేక క్యాంప్ నిర్వహించారు. ఎంపీడీఓ కార్యాలయం, పాత ఆర్డీఓ కార్యాలయంలో బీఎల్ఓలు దరఖాస్తులు స్వీకరించారు.

ఇల్లెందురూరల్: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటర్లుగా నమోదయ్యేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ రవికుమార్ అన్నారు. ఎన్నికల సంఘం ఆదేశం మేరకు మండలంలోని పోలింగ్ బూత్‌లలో ఆదివారం నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌ను ఆయన పరిశీలించారు. రోజువారీ వివరాలను కార్యాలయంలో అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

జూలూరుపాడు: 2, 3వ తేదీల్లో జరిగిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం విజయవంతం అయింది. ఆదివారం మండలంలోని పోలింగ్ స్టేషన్లను జూలూరుపాడు తహసీల్దార్ శారద ఆకస్మికంగా తనిఖీ చేశారు. మాట్లాడుతూ.. ప్రత్యేక శిబిరంలో 84 మంది కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గిర్దావర్ ఎం.తిరుపతిరావు, బీఎల్ఓలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామదేవతలకు పూజలు



పాల్వంచ: కరకవాగు హేమ్లా తండాలో బోనాలతో వస్తున్న స్థానికులు

పాల్వంచ: మున్సిపాలిటీ పరిధిలోని కరకవాగు హేమ్లా తండాలో ఆదివారం బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని మహిళలు బోనాలు ఎత్తుకుని గ్రామంలోని బొడ్రాయి, ముత్యాలమ్మకు నైవేద్యాలు సమర్పించారు. అదేవిధంగా గాంధీనగర్‌లో ముత్యాలమ్మ తల్లి ఆలయంలో లలిత సహస్రనామ త్రిషతి పంచామృతాభిషేకం నిర్వహించారు.

జూలూరుపాడు: శ్రావణమాసం సందర్భంగా ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లోని ప్రజలు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జూలూరుపాడు న్యూకాలనీ, భేతాళపాడు, పాపకొల్లు, మాచినేనిపేట, అనంతారం, వెంగన్నపాలెం, తదితర గ్రామాల్లోని మహిళలు, యువతులు సామూహికంగా బోనాలను ఊరేగింపుగా వెళ్లి శ్రీముత్యాలమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గుండెపుడిలో గ్రామస్తులు బోడ్రాయి, శ్రీముత్యాలమ్మతల్లి అమ్మవారికి 108 బిందెలతో జలాభిషేకం చేశారు. బోనాలు సమర్పించారు. మొక్కులు చెల్లించుకున్న తరువాత వర్షం కురవడంతో గ్రామస్తులందరూ ఆనందం వ్యక్తం చేశారు.

టేకులపల్లి: మండల కేంద్రంలో ఆదివారం ఘనంగా శ్రావణ బోనాలు వేడుకలు జరుపుకున్నారు. స్థానికుల బోనాలను తలపై పెట్టుకుని ఆటపాటలతో, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా బయలుదేరారు. బొడ్రాయి, ముత్యాలమ్మ, గ్రామ దేవతల ఆలయాల వద్ద ప్రదక్షిణలు చేసి, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



జూలూరుపాడు: భేతాళపాడులో...



వెంగన్నపాలెంలో పూజలు చేస్తున్న భక్తులు



టేకులపల్లి: సింగ్యాతండాలో బోనాల సందడి

అటెన్షన్ ప్లీజ్

వెలగని వీధి దీపాలు



సింగభూపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో నెల రోజులుగా వీధి లైట్లు వెలగడం లేదు. రాత్రిపూట అంధకారంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. వానాకాలంలో కావడంతో పురుగులు, విషకీటకాలు వస్తున్నాయని, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

– సుజాతనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : టి.వెంకటలక్ష్మి, ఎంపీడీఓ, సుజాతనగర్
ఫోన్ నెంబర్: 63030 23384